


రచన : "ధరణి"

పార్వతమ్మను చూచిన తర్వాత తక్కిన స్త్రీల నంతా నెమరు వేసుకోవా లంటే, చాలా కష్టంగా ఉంది శేఖరానికి. వెను వెంటనే మహారాజును చూచిన కళ్లకు మొగుణ్ని చూస్తే మొత్త బద్దే సిందన్న సామెత జ్ఞాపకం వస్తే, మూడో పెళ్లి చేసుకుని తీసుకవచ్చిన పార్వతమ్మ, శంకరయ్యగారితో ఏం సుఖపడగలదూ అనీ అనుకున్నాడు. నొచ్చుకుని వాపోయాడు కూడాను.

పాంజేబు పట్టీలు పెట్టుకుని నడిచి వెళుతూ, నూతి దగ్గర మడిగా పసుపు రాసుకుని, తడి బట్టలతో మడినీళ్లు తెస్తూ పమిట సర్దుకున్నప్పుడు, కొంజాలో హర్మ్యాని సృష్టిస్తూ వత్తులు చేసేటప్పుడు అన్యోన్యంగా గాజుల గలగల ధ్వనిస్తూనూ, చాలాసార్లు కళ్లూ కళ్లూ ఐక్యం చేసి పరాగస్నానం చేసుకున్నాడు శేఖరం. ఉస్సురని ప్రాణాన్ని చాలా బ్రహ్మాండం మీద చిక్కబెట్టుకున్నాడు.



అయినా శంకరయ్య తనమీద చూపే గౌరవం, నమ్మకం, ఆపేక్షకు కరగి పోయి, శంకరయ్య కళ్లల్లోంచి ఆవిడని చూడనూ చూచేడు. అప్పుడు మాత్రం ఈ సరి వుజ్జీలు కాని సంసారాన్ని దేవు డేవిధంగా సమకూర్చేడా అని బాధ పడేవాడు. పార్వతమ్మ అలవరచుకున్న కట్టూ బొట్టూ, పూజా పునస్కారం, మడీ మైలా అన్నీ కూడా తను నమ్మలే నట్టు కన్పించాయి. కానీ శంకరయ్య దృక్పథంలో ఆమె పల్లెటూరిది, వాళ్ల ఆచారాలను తూచా తప్పకుండా ఆచరణలో పెట్టగలది—ఈ రెండింటికీ-సమన్వయము కుదుర్చుకోలేక — సతమత మయ్యాడు శేఖరం.

ఇవన్నీ తెచ్చి పెట్టుకున్న మైపూత లేమో అని మొదట్లో అనుకున్నాడు. దినాలు వారాలు నెలలు దాటటంతో, తోటకని బిందె లోని తీర్థం అయి పోవడంతో, శంకరయ్య మీద ఉండి పోయిన

కావన—ఏమిటో ఇదమిద్ధం లేనిది—ఇల్లాగే వుండి పోయింది శేఖరాన్కి. కాంతో పార్వతమ్మ మీదా నిల్చి పోయింది సమాన ఛాయిదాలో.

నిజం చెప్పాలంటే శంకరయ్య మళ్లీ గృహస్థు కావడానికి శేఖరం, నాటికి నూరు పాళ్ళు కారణం. ఇందులో అతిశయోక్తి లేదు; అబద్ధమూ లేదు.

ఆ రోజు సాయంత్రం కొంజాలో కూర్చొని మాటలు మీద మాటలు వచ్చే కన్నే, శేఖరం అన్నాడు, "మీరు ఇల్లా ఒంటరిగావుండి పోవడం ఏంబాగో లేదు. పైగా బోలెడంత ఆస్తి వుంది. వయస్సా ఏపాటిది—నలభై అయిదే కదా" అని.

"అయితే పెళ్లి చేసుకో మంటావ్" అని ఆయన సంశయం ప్రదర్శించాడు.

"మీరు ఒట్టినే అల్లా అంటారేమిటండీ, చేసుకునే తీరాలి" అన్నాడు శేఖరం.

శంకరయ్య పొంగిపోయాడు. తను విన్నవి, కన్నవి, చదివినవి, ఈ వయస్సు వివాహాలన్నీ కూడా దండకంచేసి, "చూడండీ! మొన్న పత్రికలో ఏభై సంవత్సరాల వానికి కవలపిల్లలు కల్గేరుట" అని చెప్పాడు.

"శాస్త్రంలో నిజం వుందంటావా?" అన్నాడు శంకరయ్య.

"అదేమిటి?....మీరు వినాలిగాని" అని మధ్యలో ఆగిపోయాడు. శంకరయ్య నెల తిరక్కుండా పార్వతమ్మను పెళ్ళాడి కాపురానిగ్గూడా తెచ్చేడు.

శేఖరానికి మాత్రం గుండెలు చీరేసి నట్లయింది. పార్వతమ్మను చూచిన తర్వాత "ఊరేసేవు కదా" అని తను టూకాఇస్తే ఉగ్గుపాలతో బోధనం మొదలు బెట్టినా... చూచి వూరుకునే నోరుకట్టుకున్నాడు. ఏ మారుమనువుల్లోనో పడతాడనుకున్న ఉద్దేశ్యం వధ్యశిలే అయితే.

మూడో రోజు కాబోలు, శంకరయ్య చాటుగా పిల్చి "అన్నీ..." అని ముసిముసిగా నవ్వితే పీక నులెవయ్యా లన్నంత ఆవేశమూ వచ్చింది శేఖరానికి.

"భలే మంచిపని చేసేరు..." అని ఎంత యాథాలాపంగా అనాల నుకున్నా కోపం వ్యక్తీకరించ కుండా వుండలేక పోయాడు.

"పుస్తకాలు తెప్పించేవా?"

"ఏం పుస్తకాలు"

"అవే...ఏభై ఏళ్ల వాడికి కవలలు?" నవ్వేశాడు.

తక్కున గుండె ఆగిపోయింది;—

వెంటనే పార్వతమ్మ కన్పించింది.

మధ్యతనూ.

తలగోక్కుంటూనే బజారున పడ్డాడు. శంకరయ్య ఇచ్చిన నలగని నోట్లు జేబుల్లో చప్పుడవుతున్నాయి.

ఈ రసాయనిక శాస్త్రంలో ఒక యోగం జరగడానికి, బహిర్గత ద్రవ్య సహాయం కావలసి వుంటుంది. ఇది సంయోగ క్రియను మొదలుపెట్టి, మధ్యమంలోంచి అంత్య స్థితికి మారుస్తూ తను మారకుండానే, ఆఖరవుతుంది.

శేఖరం కూడా పార్వతమ్మ కంటె శంకరయ్యకు అల్లాగే అయ్యేడు. తను లేకపోతే శంకరయ్య లేడేమో అనుకొన్నాడు.

పార్వతమ్మను చూస్తేగుండె లుతుకుమలుకునే అనునయంతో, జాలితో, ప్రేమతో ఆ వేదనతోనే కలగిపోయాడు.

తను ఆదేశించిన, బాదం గింజలు, షాలు, పిస్తా కల్పినది...వగైరాలతో నిండిపోయిన శంకరయ్యను గుర్తుంచుకోవడంలో రాత్రులు గడిచేవి. ఆలీవ్‌తో వళ్లంతా మర్దన చేసుకునే శంకరయ్యను చూస్తే, మంత్రాలకు చింతకాయలు, రాలడం జ్ఞప్తి కొచ్చేది.

ఏతావాతా ఏమనుకున్నా శంకరయ్య పార్వతమ్మకు తూగే వయస్సువాడు కాలేడు. కనీసం తన పాప పరిహారార్థం ఆమెకు పసుపూ కుంకుమా, ఆమెఉన్నంత కాలం, ఉండి, రోజులు ఆనందంగా వెళ్లిపోతే చాలు అన్న దశకు వచ్చాడు.

దాంతో మర్నాడు శంకరయ్యను బజారుకు తీసుక వెళ్లేడు. సౌందర్యార్చనకు ఎన్నివిధాల ఉపకరణలున్నాయో అన్నీ కొనిపించేడు ఆయనచేత.

దారిపొడుగునా ఒక్కొక్కదాని విషయమే శంకరయ్యకు చెప్పేడు. ఏది ఎప్పుడు, ఎల్లా ఉపయోగించాలో వల్లింప చేసేడు. మళ్లా మళ్లా గుర్తుంచుకునేట్లు మననం చేయించేడు.

ఇంటికి వచ్చిన తర్వాత, శంకరయ్య మీదుగా, ఈ ఉపకరణాలను ఉపయోగిస్తున్న పార్వతమ్మను మనస్సులో చిత్రించుకున్నాడు. పసుపు పూతలను విసర్జించి పౌడర్ల మధ్య ములామా చేసిన పార్వతమ్మ సొగసు హొయలు...మారిన రూపాన్ని ఊహించుకున్నాడు. వీట్ల మధ్య కొత్త అందంతో నిల్చిపోయిన పార్వతమ్మను చూడాలన్న తహతహలు హెచ్చాయి.

ఆ రాత్రంతా విచిత్రంగా కలలు కన్నాడు. అందులో పార్వతమ్మ ఒళ్లంతా తనకేసి వంగిపోయి కళ్లల్లో కళ్లు కలిపి, తనకు కృతజ్ఞత తెల్పినట్లు—తను......

మర్నాడు కిటికీ సందుల్లోంచి నూతి అంచుల దగ్గర నీళ్ళుతోడే పార్వతమ్మ కళ్ల చూపుల్ని తాను అర్థంచేసుకునేందుకు తాపత్రయ పడ్డాడు.

మొఖం కంటే వీపు మరీ పచ్చగా ఉంటుందీ—అని అనుకుంటున్న సమయంలో ఒళ్లంతా సిగ్గుతో కుంచుకుపోయి, కొలకుల్లోంచి తనవైపు చూచి, లోపలికి వెళ్లిపోయింది పార్వతమ్మ. తను గిజగిజ లాడాడు.

ఊడుతూ మడుతూ వచ్చిన శంకరయ్య "శేఖరం రాత్రంతా నువ్వు ఏం చెప్పేవో అవన్నీ చేయించేను. ఎందుకూ ఇవన్నీ అంది. కానీ చివరికి ఒప్పుకుంది" అన్నాడు.

శేఖరం మాట్లాడ లేదు. "మరిపించేసిందోయి! ఆఅనురాగంలో" అని ఒళ్లంతా పువ్వుల మొలామలాగా చేసేసుకున్నాడు శంకరయ్య.

తను, కాండ్రించి ఉమ్మేయ్యాలనుకున్నాడు.

"ఇదంతా నీచలవేనోయ్! నన్ను ఓ ఇంటి వానిగా చేయించేవ్. దాన్ని నిలబెట్టుతున్నందుకు వెయ్యేళ్లు వర్ధిల్లు నాయనా" అని వణికిపోయేడు శంకరయ్య.

మరి తర్వాత?

ఆ జరిగిన వారంలోనూ, చీరలు గ్లాస్కో, ప్రింటెడ్, షిఫాను, వెల్వెట్, ఆర్గండీ వగైరాలవన్నీ ఓ రోజు, జ్లా

ముక్కలుక్క ఓరోజూ, రవ్వలనెక్లేసు పుర మాయించడానికి ఓరోజూ తనువెళ్లేడు.

అన్నిరోజుల్లోనూ శంకరయ్య వస్తూనే వున్నాడు. దినదినానికి ఓ మధురానుభూతిచెప్పుతూనే వున్నాడు. అందులోని విషయం సమగ్రంగా చెప్పడంవల్ల కొన్ని పరిస్థితుల్లో శేఖరం, వినడానికి కూడా ఇరుకులో పడే స్థితి వచ్చేది.

అయినా తను చేసే ప్రతీక్రియా కూడా దేవుడు మెచ్చుతాడని, పాప పంకిలము లేనే లేదని, దివుట తెచ్చుకున్నా లోపల్లోపల మాత్రం గగ్గోలు అయ్యేది.

తన స్థితి, అంతస్థు, పోలిక కేనా ఏదీ వుండదు. ఈ నాటి వారాల చదువు-తల్లి పరాయి ఇంట్లో వూడిగం, రేపు అన్న ఆశలు నిల్పుకోలేని అసమర్థత, ఇవన్నీ కట్ట కట్టుకుని, నుంచుని 'నీ జీవితంలో కనీసం స్థాయీ భావంలోనైనా పార్వతమ్మ పోలికలుక్క ముడిపెట్టుకొనలేవు. అసలు పొట్టేగడవంది పిల్ల నెవరిస్తారు' అన్న ఝూడింపు సంయుక్తతే అయితే కుమిలి పోయేవాడు.

ఈ ఎదుగుతున్నవయస్సులోకోర్కెలు లేక కాదు; అవి నట్టనడి మీదవే వుంచుకొన వలసి వచ్చింది తను గూడ ఓ గృహస్థు వ్వాలని, పగలులేని రాత్రిళ్లు గడపాలని, ఓ ఉన్నత అంతస్థులో పరిసరాన్ని సద్దాలని, నిండి పొంగి పొరలే ఉన్మత్తతలో ఆమెను దగ్గరగా తీసుకుని, మూగపోయిన సిగ్గులో ఆవృతం అయిన ఆమెను ముద్దు పెట్టుకోవాలని, సాయంకాలం చట్టా పట్టా లేసుకుని, మనుషులు చూడలేని స్థలాల్లో, సన్నజాజి పువ్వుల్లో ఏమిటో ఏమిటో చెయ్యాలని ఉద్రూతలూగేది మనస్సు.

అయినా తానుబ్రహ్మచారిగా,సంఘం పుట్టుక, ఎత్తుబడి, బీదరికం వుంచేసింది. ఉంచినా శంకరయ్య తనకు గుర్తున్నట్లే శిష్యరికం చెయ్యడం ఉక్కిరిబిక్కిరిచేసింది.

కొన్ని రాత్రిళ్లల్లో, గడవలేని తాలూకా ఘంటల్లో పార్వతమ్మ ఏం చేస్తోవుంటుంది-అన్న ఆలోచన, దాని వెంబడి పరివారంలా, ఆరుద్ర పురుగల రంగు జాకెట్టు, తెల్లటి గ్లాస్కోచీర, రంగేసిన బుగ్గలు, వాలుజడలో ఒదిగిపొదిగి పోయిన మల్లె జాజులు, ఎరుపెక్కిన శరీరం ఊగిపోతూ వుంటే...

కంటిమీద మగత ఆపుకోనలేని శంకరయ్య గుర్రుకొడుతూ వుంటే...

ఆపైన తలచుకొనలేక పోయేవాడు.

తనూ భౌతికంగా ఎన్ని షోడశోపచారాలు చేయించినా, పార్వతమ్మ తనను క్షమింపదని, భయం కల్గేది.

కాలు కాలిన పిల్లిలాగా అయ్యేవాడు. చికాకు కల్గేది.

అలాంటి రాత్రిలో, తనో?...... తలంచుకోలేక, శంకరయ్యస్థితిలోవుంటే, శరీరం తిరగ బడేది. కోర్కెల్లోని కుమ్మరింపు వెన్నుమీద చరిచి చలిని తోలేసేది.

కాని లోపల్లోపల...

తను కొన్నవన్నీ పెట్టుకుని, ఒక్క రాత్రి కన్పిస్తే, తనుచూడగల్గితే...అన్న తలంపు ఆషాఢ మేఘంలా విచ్చులుకొనేది.

ఆ సాయంత్రం చెయ్యాలనే, ఇంగ్లీషు పుస్తకాలను పత్రికలనూ కొని తెచ్చి శంకరయ్య చేతుల్లో పెట్టేడు తను.

తిరగ వేస్తున్న పుటల్లోన గుబాళింపును ఆగలేకనే "ఏమిటిది?" అన్నాడు పండిన మీసాలు మధ్య ఆశ్చర్యం కనపరుస్తూ శంకరయ్య.

నవ్వేడు శేఖరం.

ఆ మర్నాడు వస్తూనే శంకరయ్య "చేత కాలేదోయ్, నవ్వేశింది" అని తల వంచుకునే అన్నాడు. అది విని శేఖరం అడ్డదారి పట్టి పారిపోయాడు. తనుచేసే ప్రతీపని ఈమానసిక ఆవేదనల్లో కోర్కెలను చంపుకొనడానికన్న ఎత్తి పొడుపు కనిపిస్తున్నది.

ఆరోజు...

ఉడుతూ మడుతూ శంకరయ్య వచ్చి "అర్జంటుగా—వూరు వెళ్లాలి నేను. రేపటికల్లా వచ్చేస్తాను. - ఇవ్వాళికి కాస్త సాయంగా వుండేం" అని నమ్మకంగా చెప్పేడు.

శేఖరంకు ముచ్చెమటలూ పోసేయి. పిరికితనం వచ్చింది.

ఏవూరేనా తనూ వెళ్ల పోదామా అన్న ఆలోచన కల్గింది. అపుకొనలేని భయం ఆవరించింది.

డెక్కపట్టినట్లే నడచేడు. గుమ్మంలో కాలెట్టే సరికి ఆవిడా ఎదురైంది. చూస్తే అంగుళం దళసరి పసుపు, అర్ధణా అంత కుంకం, బిళ్లగోచీ, పాంజేబు పట్టాలు.

నోరెండినట్లే అయితే "శంకరయ్య తన్ని ఎంత వేధవని చేసిపారేసేడు" అనుకుని తల ఒంచేసుకున్నాడు శేఖరం.

సంధ్య వెల్తురు చప్పాల క్రిందనుంచి, లోపలికిదూరి దీపాల్ని రెచ్చగొడుతోంది. వచ్చీరాలేని వెన్నెల ఎర్రటి కొండల్లోంచి, ఉరుకు లేస్తోంది.

"నాయనా! ఇవ్వాళ ఇక్కడే భోజనము చేద్దువుగాని..." అని ముక్తసరిగా అంది ఆవిడ; చిన్నదైనా పెద్ద ఆరిందాలా.

పార్వతమ్మ ప్రవృత్తి ఏమిటి అన్నదే అతనికి కాలేదు తికమక పడ్డాడు. వయస్సులో, వుద్రూతలూగిన, సారినకాళ్లల్లా ప్రవర్తించే ఈమెను అర్థం, తన దృష్టిలో చాలా నీచంగా, చులకనగా చూచేదేమో, అల్లాచూచి మూర్ఖుడు అయ్యేడేమో అనే ఆలోచన క్రమ్మింది.

ఒంచిన తల ఎత్తకుండా విస్తరిముందు కూర్చొన్నాడు; ఈ వరసనుండి ఆవరస జాపోసనంలాగే వ్యంజనాలు నిండుకోవడంతో, సందిగ్ధం కలిగి పోయింది.

"అదేమిటి నాయనా! వయస్సులో వున్న వాడవు. పూరీలు తినలేదేం. క్షీరాన్నం తాకనే లేదు. బంగాళాదుంపల వేపుడు ముట్టనే లేదు. రవ్వపులుపు పెట్టిన పెసర పచ్చడీ కల్పుకోలేదు" అంటూనే ఆవిడ మరిన్ని వేయడంతో నోట ముద్ద ఎక్కనే లేదు.

"రోజూ పాలుపుచ్చుకుంటే బలంట. నువ్వు పుచ్చుకో" అన్నది.

"అవి బాదంపాలు-పిస్తా, జీడిపప్పు చారపప్పు కల్పితే మంచిదట" అన్నది.

"పడుకోబోయే ముందర గులకంద ఉత్తమ మట నాయనా" అన్నది.

ఆవిడ అంటూనే వుంది. తెచ్చి పెడుతూనే వుంది. టూపులు లేచి పోయేయి శేఖరానికి.

"ఏదో కాస్త కతికి వస్తా...కావలిస్తే ఆగూట్లో వున్న పుస్తకాలు చూస్తూ కూర్చోనాయనా..." తనుకొని ఇచ్చిన పుస్తకాలే–చెమటలు పోసేయి.

తనపాఠం, తను శంకరయ్య మీదుగా చెప్పిన వల్లీయాలు తనకే కట్ట బెట్టింది. ఎప్పుడు తెల్లవారుతుందా అన్న ఆలోచన లోనే పడ్డాడు; ముళ్లమీద నుంచున్నట్లే.

నిజంగా ఆలోచిస్తే తను, తన వూహా, ఎత నైతిక పతనంలో వుందో అన్న సముదాయింపు కన్పించింది. శంకరయ్యకు తనెవ్వరు? తనస్థలం ఏమిటి?...ఎక్కడ? తను ఇటువంటి విషయాల్లో కల్గచేసుకోవడంలో అవుచిత్యం...తన వ్యర్థ జీవితం తన్నే వెర్రి వెంగళాయిని చేసిందంటే కుళ్లిపోయే మాగన్నగా మూసుకున్నాడు కళ్లు...పాడారిపోయిన కాలికాలు మూత పడే లేదు.

ఆరిపోయిన దీపంలో చీకటి అంతర్లీన మయింది.

"శేఖరం ఇలారా నాయనా!" ప్రక్క గదిలోంచి వణికి పోతున్న గొంతు విని పించింది. ఖంగారుగా లేచి, వెళ్లేడు... "ఏమం..." తక్కినది అనలేక నోటనీళ్లే లేక కళ్లప్పగించేసేడు.

ఎదురుగా, ఆవిడ, పాదాలమీదనుండి చూస్తూనే, ఆ కడియాలు లేవు...ఆగోచీ లేదు. సన్నటిగ్లాస్కో–చీర, అరుద్రపురుగు జాకెట్టు, ముఖానికి చెర్రిబ్లాజం పౌడరు, పౌడరుమధ్య వాసవేసే సెంట్, ఒక్కొక్క–గా నొక్క–చేతికి ఏడురంగుల గాజు, ముఖములో బటానీకి తక్కువగా ముంగురుల మధ్య మెరసిపోయే తళుకు, వాలు జడలతో దోబూచులాడే మల్లె చెండ్ల మరువము, బుగ్గల మధ్య సొట్టల్లో నవ్వునింపు కున్న కైపు. ఎరుపెక్కి, బరువైన కను మూత పడలేని కాటిక కండ్లు... రమ్మన్న పిలుపు, చప్పున కౌగలించుకుంది ఆవిడ.

అయోమయం అయిపోయి, కప్పు కూలినట్టే, చేతులు విడిపించుకుని పారి పోయేడు శేఖరం...

వీధి గుమ్మందాటే టప్పుడే శేఖరంకు "ఓరి భండా" అన్న వాక్యం వినపడింది. అంతే, గదిలోకి వచ్చి బుడ్డిదీపం వెల్గించే సరికి వళ్లంతా, చెమటలు కారిపోయాయి.

మర్నాడు వచ్చిన శంకరయ్య గుండెలు గవుక్కుంటూ వచ్చి "కొంపమునిగి పోయింది. మనం కొన్న వన్నీ పగలగొట్టే సింది. చీరలన్నీ చింపేసింది. పుస్తకాలెట్టి నీళ్లు కాచుతున్నది" అని ఏవేవో చెప్పేడు.

గుండెలు చిక్కబెట్టుకునే "అయితే గోదావరిలో దిగండి" అన్నాడు.

శంకరయ్య నోరెండుకపోయింది.

